క్లుప్తంగా

వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి

నాగర్‌కర్నూల్ రూరల్: ఐకేపీలో పని చేస్తున్న వీఓఏలను ప్రభుత్వం సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి కనీసం వేతనం రూ.26 వేలు ఇవ్వాలని రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సీఐటీయూ కార్యాలయంలో ఐకేపీ వీఓఏల సంఘం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఆర్. శ్రీనివాస్, ఐకేపీ ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు వర్ధన్ పర్వతాలు, ఐకేపీ వీఓఏల సంఘం జిల్లా నాయకులు వెంకటయ్య, మల్లేష్, అలివేలమ్మ, వెంకటస్వామి, ఓషియా బేగం తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ



కందనూలు: నులి పురుగుల మాత్రల పంపిణీపై జిల్లా కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఉపాధ్యాయులకు గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ నెల 11న ప్రతి విద్యార్థికి ఆల్బెండజోల్ మాత్రను వేసి నులి పురుగుల నివారణకు పాటు పడాలని పెద్దముద్దునూర్ ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి డాక్టర్ సృజన కోరారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు జూనియర్ కళాశాలలోని ప్రతి విద్యార్థికి మాత్రను వేసే విధంగా ఉపాధ్యాయులు, అధ్యాపకులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి భాస్కర్ రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ నరసింహ, మండలంలోని ప్రభుత్వం, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాహనాల రద్దీపై గ్రామసభ



దోమలపెంట(బ్రహ్మగిరి): వారాంతంలో శ్రీశైలం హైదరాబాద్ ప్రధాన రహదారిలో వాహనాల రద్దీపై గురువారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి ఎం.రాజశేఖర్ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. గ్రామస్తులతో పలు విషయాలను చర్చించారు. వాహనాలు వేగంగా వెళ్తున్నాయని దీంతో గ్రామస్తులు భయాందోళనక గురవుతున్నారని కార్యదర్శికి వివరించారు. బ్రహ్మగిరి అటవీ చెక్‌పోస్ట్ నుంచి ఈగలపెంట వరకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరారు. బ్రహ్మగిరి, సున్నిపెంట మధ్యలో ఏపీ పరిధిలో లింగాలఘట్టు వద్ద ఉన్న అటవీ చెక్‌పోస్ట్ వారు లోకల్ వాహనాల నుంచి రుసుములు వసూలు చేస్తున్నారని వివరించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కె.మోయిజ్, గురువయ్య, సిరాజ్, రసూల్, మాజీ సర్పంచ్, ఉప సర్పంచ్‌లు శారద, ప్రసాద్ గ్రామస్తులు పాల్గొన్నారు.

సాగుభూములకు పట్టాలివ్వాలి



కొల్లాపూర్/పెద్దకొత్తపల్లి: రైతులు సాగుచేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలని కోరుతూ సీపీఐ నాయకులు గురువారం కొల్లాపూర్ ఆర్డీఓ భన్సీలాల్‌కు వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా సాదాబైనామాల ద్వారా పెద్దసంఖ్యలో రైతులు భూములు కొనుగోలు చేశారని, అసైన్డ్ భూములను కూడా కొనుగోలు చేసి సాగు చేసుకుంటున్నారని వారు ఆర్డీఓకు వివరించారు. భూభారతి చట్టం ప్రకారం భూములు సాగుచేసుకుంటున్న రైతులందరికీ పట్టాలు ఇవ్వాలని వారు కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు హుస్సేనయ్య, ఏసయ్య, బొల్లెదుల శ్రీనివాసులు, రాజు, కృష్ణ తదితరులు ఉన్నారు.

భూభారతి సమస్యలు పరిష్కరించాలి

కల్వకుర్తి రూరల్: మండలంలోని రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించాలని ఆర్డీఓ జనార్దన్ రెడ్డిని మాజీ ఎంపీటీసీ రామకృష్ణ కోరారు. గురువారం ఆర్డీఓను కలిసి భూభారతి సమస్యలపై చర్చించారు. అనంతరం శాలువాతో సన్మానించారు.



చెంచులకు వైద్య సేవలు అందేనా?

- అందుబాటులోకి రాని పరీక్షలు
- నిరుపయోగంగా డయాగ్నోస్టిక్ సెంటర్

మన్ననూర్: గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలతో పాటు అన్ని రకాల వైద్య పరీక్షలు(టెస్టులు) అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశ్యంతో రెండేళ్ల కిందట డయాగ్నొస్టిక్ సెంటర్‌ను నిర్మించారు. రూ. కోటి వెచ్చించి మన్ననూర్‌లో భవనం నిర్మించారు. కాని డయాగ్నొస్టిక్ సేవలు అందుబాటులోకి రాకపోవడంతో ఏజెన్సీ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రెండేళ్లు పూర్తవుతున్నా ఎప్పుడు ప్రారంభిస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ, మధుమేహం, హిమోగ్లోబిన్, థైరాయిడ్ తదితర పరీక్షలు క్షేత్ర స్థాయిలో సేవలు అందుబాటులోకి రాకపోవడంతో రోగులు నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు. ప్రజల సొమ్ము కాంట్రాక్టర్లకు, పార్టీ నాయకులకు అప్పనంగా అప్పజెప్పిందనే విమర్శలు కూడా వినిపిస్తున్నారు. ఇదిలా ఉండగా ఆదివాసి చెంచులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం కోసం ప్రస్తుత ప్రభుత్వం రాష్ట్రంలో నూతనంగా 6 డయాగ్నొస్టిక్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. సీఎం ప్రకటించిన జాబితాలో మన్ననూర్ డయాగ్నొస్టిక్ కేంద్రం కూడా ఉండటం గమనార్హం. విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం అంటున్న ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ఈ దిశగా సమాలోచనలు చేసి ఈ ప్రాంత ప్రజలకు అన్ని రకాల వైద్యం అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.

వృథాగా ఆరోగ్య కేంద్రాలు

అదేవిధంగా 12 ఏళ్ల కిందట ఏజెన్సీ ప్రాంతాలైన మన్ననూర్, లింగాల, బల్మూర్ పీహెచ్‌సీల పరిధిలో 'ఈ ఆరోగ్య కేంద్రాలను' కూడా ఏర్పాటు చేశారు. వైద్యులను, సిబ్బందిని నియమించకపోవడం ఆరోగ్య కేంద్రాలు వృథాగా దర్శనమిస్తున్నాయి. ఆర్థిక స్థోమత లేని ఏజెన్సీ ప్రాంతాలలోని రోగులను స్థానిక వైద్యులు ఈ ఆరోగ్య కేంద్రంలో పరీక్షించి అత్యవసర పరిస్థితుల్లో టెలీ మెడిసిన్ వైద్య విధానంలో రోగికి సలహాలు, సూచనలు ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నా సేవలు అందుబాటులోకి రాలేదు. అవసరమైన చికిత్స కోసం రూ.లక్షల విలువ చేసే కొన్ని పరికరాలు కొనుగోలు చేసి వదిలేశారు. ప్రస్తుతం ఈ ఆరోగ్య కేంద్రంను పాత సామానులు భద్రపరిచేందుకు వినియోగిస్తున్నారు. అదేవిధంగా అమ్రాబాద్ మండలంలోని వివిధ గ్రామాలలో రూ. లక్షలు వెచ్చించి నిర్మించిన నిర్మాణాలు అలంకారప్రాయంగా మిగిలిపోతున్నాయి. ప్రస్తుతం ఈ కేంద్రం నిర్మాణం కూడా నిరుపయోగంగా ఉండటం ఈ ప్రాంత ప్రజలకు ఆరోగ్య పరమైన శాపంగా మారింది.



మన్ననూర్‌లో నిరుపయోగంగా ఉన్న డయాగ్నొస్టిక్ సెంటర్

అందుబాటులోకి తీసుకొస్తాం



రెండేళ్ల కిందట చెంచుల కోసం ఐటీడీఏ నిధులతో డయాగ్నొస్టిక్ సెంటర్‌ను నిర్మించారు. డయాగ్నస్టిక్ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో అన్ని రకాల టెస్టులతో పాటు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తాం.

–రవికుమార్, ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ, నాగర్‌కర్నూల్

ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లలేం



ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లేందుకు ఆర్థికస్థోమత లేదు. పరీక్షల కోసం అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. పరీక్షలు చేసుకోకుండానే వైద్యులు సూచనమేరకు మందులు వాడుతున్నాం. మన్ననూర్‌లో అన్ని రకాల పరీక్షలు చేసే ఆస్పత్రిని ప్రారంభించి సరైన మందులు ఇస్తే బాగుంటుంది.

–భౌరమ్మ, మాజీ సర్పంచ్(చెంచు), కుడిచింతలబైలు

పరీక్షలు నిర్వహించాలి



డయగ్నస్టిక్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చి పరీక్షలు చేయాలి. రెండేళ్లుగా రోగులు ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. పరీక్షల కోసం అచ్చంపేట ఆస్పత్రికి వెళ్లాల్సిన దుస్థితి. మన్ననూర్ గ్రామంలోని పీహెచ్‌సీలో అన్నిరకాల టెస్టులు చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

–నిమ్మల గురువయ్య, అప్పాపూర్ పెంట

పారదర్శకంగా సంక్షేమ పథకాలు

వంగూరు: పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. గురువారం మండలంలోని కొండారెడ్డిపల్లిలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సభ నిర్వహించారు. పలు అభివృద్ధి పనులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని తెలుసుకున్నారు. తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులో రైతులు చేసిన దరఖాస్తుల ఎన్ని పరిష్కరించారు, ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయని తెలుసుకున్నారు. అనంతరం పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యులు, వైద్య సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండాలన్నారు. రోడ్ల విస్తరణ, అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ, సెంట్రల్ లైటింగ్, మిషన్ భగీరథ పైప్‌లైన్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్, కొండారెడ్డిపల్లి ప్రత్యేక అధికారి దేవ సహాయం, డీఆర్డీఏ చిన్న ఓబులేసు, కల్వకుర్తి ఆర్డీఓ జనార్దన్ రెడ్డి, డీపీఓ శ్రీరాములు, పంచాయతీరాజ్ ఈఈ విజయ్, మిషన్ భగీరథ ఈఈ సుధాకర్ సింగ్ పాల్గొన్నారు.



కొండారెడ్డిపల్లిలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాదావత్ సంతోష్

ప్రతి ఒక్కరు సేవా దృక్పథాన్ని కలిగి ఉండాలి



తెలకపల్లి: ప్రతి ఒక్కరు సేవ దృక్పథాన్ని కలిగి ఉండాలని హెచ్‌ఎం రమేష్ అన్నారు. గురువారం మండలంలోని గౌతంపల్లి ప్రాథమిక పాఠశాలకు గ్రామ పెద్దలు యాదారెడ్డి, రఘుమారెడ్డిలు విద్యార్థుల అవసరం నిమిత్తం ప్రింటర్స్‌ను, డ్రమ్స్‌ను వితరణ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం దాతలను అభినందించారు.

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి



నాగర్‌కర్నూల్ రూరల్: పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు గుంపల్లి అశోక్ కోరారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని దేశిటిక్యాలలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారుల ఇళ్లను ఆయన పరిశీలించారు. ప్రొసీడింగ్ పొందిన వారు ఇళ్లను నిర్మించుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శంకర్ రాజు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

108 వాహనం తనిఖీ



తెలకపల్లి: మండల కేంద్రంలో 108 వాహనాన్ని జిల్లా అధికారి డీఎంఈ శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. మందులను, పరికరాలను పరిశీలించారు. టెక్నిషియన్ శ్రీకాంత్, పైలట్ రాములు, తదితరులు ఉన్నారు.

అచ్చంపేట రూరల్: పట్టణంలో 108 అంబులెన్స్ వాహనాలను గురువారం జీవీకే ఈఎంఆర్ఐ జిల్లా మేనేజర్ శ్రీను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంబులెన్స్‌లో పరికరాలు, వాటి పనితీరు, మందులు, రికార్డులను పరిశీలించారు. ఏదైనా పరికరాలు పని చేయకపోతే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో అంబులెన్స్ సిబ్బంది ఆంజనేయులు, పైలట్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

డీలర్లకు అవగాహన



తాడూరు: తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన కొత్త రేషన్‌కార్డుల అమలు కోసం గురువారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో డీలర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జయంతి డిప్యూటీ తహసీల్దార్ మహమూద్ అలీలు వారికి సూచనలు, సలహాలు ఇచ్చారు. కొత్త రేషన్‌కార్డు దారుల వివరాల జాబితాను అందజేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రేషన్ డీలర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలో విద్యార్థికి బంగారు పతకం



పెద్దకొత్తపల్లి: తెలంగాణ ప్యార స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాదులో దివ్యాంగులకు జావెలిన్‌త్రో, షాట్‌పుట్ పోటీలు నిర్వహించారు. మండలంలో లిటిల్ బర్డ్స్ పాఠశాల చెందిన గోపాలలోకేష్ ఆయా పోటీల్లో ప్రతిభ కనబర్చి బంగారు పతకం సాధించాడు. గురువారం పాఠశాలలో ఆ పాఠశాల కరస్పాండెంట్ రఘుపతిరెడ్డి, ప్రిన్సిపాల్ నర్సింహ, ఉపాధ్యాయ బృందం విద్యార్థి గోపాల లోకేష్‌ను అభినందించి సన్మానించారు.

సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం

పాన్‌గల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సైబర్ మోసాల నివారణపై గురువారం అవగాహన కల్పించారు. ఆర్‌బీఐ సహకారంతో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఎన్జీఓ సౌజన్యంతో నిర్వహించిన అవగాహన సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ తిరుమల్ రావు, ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్ నాగేష్‌కుమార్ మాట్లాడారు. సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా, ఆధార్ వివరాలను ఇతరులకు చెప్పకూడదన్నారు. విద్యార్థులు సైబర్ మోసాల నివారణపై గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. అనుమానిత వ్యక్తులు కన్పిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ గోవింద్ రావు, హెచ్‌సీ చంద్రశేఖర్, కార్యదర్శి నరేశ్‌గౌడ్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లిపాలతో రోగనిరోధక శక్తి



కల్వకుర్తిలో తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న సూపరింటెండెంట్ శివరాం

కల్వకుర్తి టౌన్: తల్లిపాలు బిడ్డకు రోగనిరోధక శక్తి పెంపొందుతుందని సీహెచ్‌సీ సూపరింటెండెంట్ శివరాం అన్నారు. గురువారం పట్టణంలోని సీహెచ్‌సీలో గర్భిణులకు, బాలింతలకు తల్లిపాల వారోత్సవాలలో భాగంగా తల్లిపాలపై అవగాహన కల్పించారు. డబ్బా పాలను పట్టించటం వలన చిన్నారుల ఎదుగుదలలో సమస్యలు ఎదురవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆస్పతి వైద్యులు యశోదాభాయి, విష్ణు, పాండురంగ, షఫీ, ఆస్పతి సిబ్బంది, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ముర్రుపాలు పట్టించాలి

చారకొండ: అప్పుడే పుట్టిన నవజాత శిశువుకు ముర్రుపాలు పట్టించాలని మెడికల్ ఆఫీసర్ సృజన అన్నారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా గురువారం మండల కేంద్రంలో అంగన్‌వాడీ కేంద్రం -1లో తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. అనంతరం గర్భిణులకు బాలమృతం పంపిణీ చేశారు. ఏఎన్‌ఎం అలివేలు, అంగన్‌వాడీ టీచర్ సుదేష, తదితరులు పాల్గొన్నారు.

లింగాలలో..

లింగాల: చిన్నారుల ఎదుగుదలకు తల్లిపాలే శ్రేయస్కరమని ఐసీడీఎస్ సీడీపీఓ దమయంతి అన్నారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల తల్లులతో సమావేశం నిర్వహించారు. తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ గిరిజ, ఏఎన్‌ఎం రాజీబాయి, విజయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



చారకొండలో



లింగాలలో..

ముందస్తుగా రక్షాబంధన్ వేడుకలు



బిజినేపల్లి మండలం కారుకొండ ప్రాథమికోన్నత పాఠశాలలో రాఖీలు చూపిస్తున్న చిన్నారులు



మొలచింతపల్లి ఉన్నత పాఠశాలలో రాఖీలు కడుతున్న విద్యార్థులు

నాగర్‌కర్నూల్: జిల్లా కేంద్రంలో గురువారం ముందస్తు రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. ఇందులో భాగంగా కలెక్టరేట్‌లో ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన విద్యార్థులు కలెక్టర్ బాదావత్ సంతోష్‌కు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్ పండుగ జరుపుకుంటామని వివరించారు. భారతీయ సంస్కృతి విశిష్టత, సంప్రదాయాలను పరిరక్షించాలని సూచించారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కారుకొండలో..

బిజినేపల్లి: మండలంలోని కారుకొండ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు గురువారం ముందస్తుగా రాఖీ పండుగ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. హెచ్‌ఎం రామకృష్ణ, భాగ్యలక్ష్మి, ఇంద్రాణి, శ్రీకాంత్, లావణ్య, చెన్నమ్మ పాల్గొన్నారు.

మొలచింతపల్లిలో..

కొల్లాపూర్ రూరల్: మండలంలోని మొలచింతపల్లిలో ఉన్న ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులు రక్షాబంధన్ వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు అందజేత



చారకొండ: మండలంలోని జూపల్లి గ్రామానికి చెందిన మాద్గుల హుస్సేన్, కడారి కళమ్మ, జేపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని దొంగలగుట్ట తండాకు చెందిన రాత్లావత్ నవీన్‌కు రూ. 60 వేల చొప్పున సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి నిధుల మంజూరయ్యాయి. ఈ మేరకు గురువారం ఆయా గ్రామాల్లో డీసీసీ ప్రధాన కార్యదర్శి బాలరాజు, కాంగ్రెస్ నాయకులు బాధితులకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ మాధవ రెడ్డి, నాయకులు అశోక్ నాయక్, సంజీవ్, కూభ్య, జయందర్ తదితరులు ఉన్నారు.

పెద్దకొత్తపల్లి: ముష్టిపల్లి గ్రామానికి చెందిన జమీల్‌కు సీఎం సహాయనిధి నుంచి రూ.48 వేలు మంజూరయ్యాయి. గురువారం బాధిత కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ నాయకుడు చంద్రశేఖర్ అందజేశారు. కార్యక్రమంలో తిరుపతయ్య, చిన్ననర్సింహ, జయరాజ్, మల్లేష్, వెంకటేష్ పాల్గొన్నారు

విద్యా సామర్థ్యాలను పెంచాలి



లింగాల: ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం వచ్చి ఉండాలని మండల విద్యాధికారి బషీర్ అహ్మద్ ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని జీల్గుపల్లి, జీల్గుపల్లితండా, శాయిన్‌పేట పాఠశాలలను గురువారం ఎంఈఓ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులలో సామర్థ్యాలను పరిశీలించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులకు సూచించారు. సమయపాలన పాటించి మార్గదర్శకులుగా ఉండాలని సూచించారు.

వర్షం కోసం పూజలు

తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో వానాకాలం పంటలు సాగు చేసిన రైతులు 20 రోజుల నుంచి వర్షం కురవకపోవడంతో మండలంలోని పాపగల్‌లో ప్రత్యేక పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వర్షం బాగా కురిసి పంటలు పండాలని వరుణ దేవుడిని వేడుకున్నారు.

పూలు, పండ్ల మొక్కల పంపిణీ



మన్ననూర్: అమ్రాబాద్ మండలం మాచారంలో వన మహోత్సవంలో భాగంగా ఇంటింటికి పూలు, పండ్ల మొక్కలను డీసీసీ కార్యదర్శి కోరె రేణయ్య పంపిణీ చేశారు. పచ్చదనం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ముత్యం నాయకులు అశోక్, ముత్యాలు, మల్లయ్య, రాములు, మారుతి, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సామూహిక వరలక్ష్మి వ్రతాలు

కందనూలు: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని సత్యసాయిబాబా మందిరంలో విశ్వ వాసనామ సంవత్సరం శ్రావణమాసం మూడో శుక్రవారం సందర్భంగా ఉదయం 10:30 గంటలకు సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహిస్తున్నట్లు సత్యసాయి సేవా సమితి కన్వీనర్ హకీం విశ్వప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ తో పాటు సామూహిక భోజనాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

ముగ్గురిపై కేసు నమోదు

లింగాల: మండలంలోని అంబట్‌పల్లికి చెందిన గైరమోని శివరాం బుధవారం ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలో గురువారం అదే గ్రామానికి చెందిన గోరంట్ల సురేష్, తులసి గణేష్, చుక్కరవి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్‌గౌడు తెలిపారు. యువకుడు ఆత్మహత్య చేసుకోవడానికి ముందు మరో ముగ్గురు వ్యక్తులతో కలిసి ఉండడంతో అనుమానం వ్యక్తం చేస్తూ మృతుని తండ్రి నిరంజన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్వకుర్తి రూరల్: పట్టణంలో నూతన విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉన్న ప్రాంతాలలో శుక్రవారం ఉదయం11 గంటల నుంచి మధ్యాహ్నం 2:00 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తిలక్ నగర్, విద్యుత్ కార్యాలయం, హనుమాన్ నగర్, సిలార్ పల్లి తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ పేర్కొన్నారు.

చెక్కులు అందజేత



పెద్దకొత్తపల్లి: చంద్రబండ తండాకు చెందిన ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకుంటున్న లాలమ్మ, సునీతలకు ఒక్కొక్కరికి రూ. లక్ష మంజూరయ్యాయి. ఈ మేరకు గురువారం మాజీ సర్పంచ్ రాంలాల్ లబ్ధిదారులకు చెక్కుల అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తండాలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకుంటే రూ. 5 లక్షలు విడతలు వారీగా మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో రవినాయక్, రాంచందర్, భగత్‌సింగ్, హరిలాల్, లాల్‌నాయక్ పాల్గొన్నారు.

ఇంటింటికీ బీజేపీ



చారకొండ: బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బూత్ స్థాయి మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల అధ్యక్షుడు చెలమోని కృష్ణ ఆధ్వర్యంలో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని చేపట్టారు. గురువారం మండలంలోని సిర్సనగండ్ల, అయోధ్యనగర్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. దేశ భద్రత బీజేపీతోనే సాధ్యమన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. మండల ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు శ్రీరాములు, నరేష్, పగడాల తిరుపతయ్య, జెట్టమోని శ్రీను, బండ్ల మల్లేష్, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌ల పంపిణీ

వీపనగండ్ల: మండలకేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు గురువారం అధికారులు, కాంగ్రెస్ నాయకులు ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఇళ్లు లేని వారికి ప్రభుత్వం ఆర్థికసాయం అందజేస్తుందన్నారు. అనంతరం ఎంపీడీఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మండల కేంద్రంలో 50 మందికి ఇళ్లు మంజూరు అయ్యాయని వాటిలో 42 మందికి ప్రొసీడింగ్ పత్రాలను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ రాజు, పంచాయతీ కార్యదర్శి రమేశ్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.